భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో పూజలు

రఘునాథపల్లి: మండలంలోని ఆలయాల్లో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు శ్రావణ పూజలు చేశారు. రఘునాథపల్లి, ఖిలాషాపూర్, కంచనపల్లిలో ఆలయాల్లో విశేష పూజలు చేశారు. నిడిగొండ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేద పండితులు కృష్ణమాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య మహిళలు సామూహిక లక్ష్మీ ఆరాధన చేశారు. రఘునాథపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో భక్తులు గోపూజ చేశారు.


రఘునాథపల్లి: నిడిగొండలో సామూహిక లక్ష్మీ ఆరాధన చేస్తున్న భక్తులు

లక్ష్మీదేవికి..

జనగామ రూరల్: శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో పట్టణంలోని గుండ్లగడ్డ ప్రాంతంలో మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలను పిలిచి వాయినం ఇచ్చారు. పూజా కార్యక్రమం అనంతరం లలిత సహస్రపారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమంలో హైమ, జ్యోతి, స్వాతి, రజిత, సిరి, సౌమ్య, రాణి తదితరులు పాల్గొన్నారు.

స్వయం భూ గుహలో..

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి స్వయంభూగా వెలిసిన గుహలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు-కిరణ్మయి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, ద్వాదశ అల్వార్‌లకు పంచామృత అభిషేకం, అలంకరణ సేవలు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కురెంల మోహన్, మల్లికార్జున్, రాజేష్, శేఖర్, విష్ణు తదితరులు ఉన్నారు.


రఘునాథపల్లి: గోవులను పూజిస్తున్న భక్తులు


చిల్పూరు: పూజలో పాల్గొన్న శ్రీధర్‌రావు


జనగామ రూరల్: లక్ష్మీదేవికి పూజ చేస్తున్న మహిళలు

సృజనాత్మక ఆలోచనలు పెంచడమే లక్ష్యం

లింగాలఘణపురం: విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంచడమే లక్ష్యంగా రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వ్యవస్థాపకుడు కోమరగిరి సహదేవ్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని 8,9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం సోహం అకాడమీ ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సహదేవ్ మాట్లాడుతూ రోబోటిక్స్ రంగంలో విద్యార్థులు ప్రవేశించే విధంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 120 మంది విద్యార్థులకు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలు, ఎలా పని చేస్తాయనే విషయాలను వివరించి రోబోటిక్ కిట్‌ను కూడా అందజేశారు. ప్రిన్సిపాల్ పుష్పకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న సహదేవ్

ఇసుక డంప్‌ల వేలం

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన రెండు ఇసుక డంప్‌లను ఈ నెల 28న పోలీసులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా సీజ్ చేసిన విషయం విదితమే. అక్రమంగా ఇసుక నిల్వ చేసిన మాల్ల రాజును తహసీల్దార్ ఎందుట పోలీసులు బైండోవర్ చేసి డంప్‌లను సీజ్ చేశారు. గ్రామస్తుల సమక్షంలో ఎంఆర్‌ఐ శరత్‌చంద్ర పోలీసులతో కలిసి ఇసుక డంప్‌లకు వేలం నిర్వహించారు. శ్రీపరివార్ యోగా ఆశ్రమంలోని డంప్‌కు వేలం వేయగా అదే గ్రామానికి చెందిన లింగాల జోగారెడ్డి రూ.27,500లకు, కురుమగూడెంలోని డంప్‌కు వేలం వేయగా స్థానికుడు ఎండీ అబ్బాష్ రూ. 50 వేలకు వేలం పాడి దక్కించుకున్నారు. వేలంకు చెందిన రూ.77,500 శుక్రవారం జోగారెడ్డి, అబ్బాస్ ఎస్‌టీఓలో జమచేసి వేలంలో దక్కించుకున్న ఇసుక డంప్‌లు స్వాధీనం చేసుకున్నారు.


ఇసుక డంప్‌లకు వేలం నిర్వహిస్తున్న ఎంఆర్‌ఐ శరత్‌చంద్ర

తొలగించిన స్థలంలోనే గద్దె ఏర్పాటు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో దళిత సంఘాలు, ఎస్సీలు ఏర్పాటు చేసుకున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గద్దెను తొలగించిన చోటనే ఏర్పాటు చేయాలని దళిత సంఘాల జిల్లా నాయకులు గాదె రాములు, పైస రాములు, రడపాక పరంజ్యోతి డిమాండ్ చేశారు. రాఘవాపూర్‌లో ఎస్సీలు ఏర్పాటు చేసుకున్న గద్దెను కొందరు బీసీలు, ఓసీల ప్రోద్బలంతో తొలగించారని ఈనెల 27న స్థానిక పోలీసుస్టేషన్‌లో దళితులు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. సదరు సమస్య పరిష్కారం కోసం పోలీసుల సూచనల మేరకు శుక్రవారం గ్రామంలో ఎస్సీలు, బీసీలు, ఓసీలు, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు గ్రామంలో సమావేశమై చర్చించారు. కాగా, గద్దెను తొలగించిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని ఎస్సీలు పట్టుబట్టగా, అక్కడ గ్రామంలోని అన్ని కులాల వారి కోసం రచ్చబండ నిర్మాణం చేస్తున్నామని, గద్దెను కాస్త పక్కన ఏర్పాటు చేయాలని బీసీలు, ఓసీలు తమ వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వారు పట్టుబట్టడంతో చర్చ కాస్త రభసగా మారింది. దాంతో ఎస్సీలు అక్కడ బైఠాయించి జై భీమ్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల జిల్లా నాయకులు మాట్లాడుతూ సమస్యను గ్రామంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అయితే అంబేడ్కర్ గద్దెను మాత్రం తొలగించిన స్థలంలోనే ఏర్పాటు చేయాలని వారు కోరారు. దాంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పారు. ఇరువర్గాల నుంచి ఐదుగురి చొప్పున పెద్దమనుషులు సమస్యను పరిష్కరించేలా తీర్మానం చేయాలని, ఆవేశాలతో గొడవలు తప్ప ఒరిగేదేమి లేదని సముదాయించారు. దాంతో ఇరువర్గాలు శాంతించి సమస్యపై సోమవారం (సెప్టెంబర్ 2న) చర్చించుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల కుమార్, కాసాని బొందయ్య, బత్తిని దశరథం, రీగన్‌రెడ్డి, జయపాల్ రెడ్డి, కందుల గట్టయ్య, శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేష్, చాడ ఏలియా, సింగపురం ఏలియా, ఏడెల్లి శివ, సింగపురం ఉదయ్, మేడ సలీమ్, హరిబాబు, చంటి, సత్యం, రాము, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.


చర్చిస్తున్న బీసీ, ఓసీ, ఎస్సీలు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. మండలంలోని పాంనూర్ గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు సట్ల వెంకటరమణగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జీవీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పలు హామీలు చేసి గద్దెనెక్కిందని, హామీలను విస్మరిస్తూ ప్రజలను దగా చేస్తుందన్నారు. ఐలోని అంజిరెడ్డి, ఇనుగాల యుగేందర్‌రెడ్డి, బూర్ల విష్ణు, ఆరోగ్యం, కృష్ణమూర్తి, రాజ్‌కుమార్, రాజేష్ రెడ్డి, తిరుపతి, వెంకటేష్, నవీన్, రమేష్, వెంకటయ్య, వెంకన్న, అయ్యప్ప, నాగరాజు, శివ పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదు చేయాలి

తరిగొప్పుల: బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మండలంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేయించాలని జనగామ అసెంబ్లీ ప్రముఖ్ ధరావత్ రాజు నాయక్ పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సభ్యత్వ నమోదు వర్క్‌షాప్ నిర్వహించగా రాజు నాయక్ పాల్గొని మాట్లాడారు. కొన్నె రాజు, జీల సతీష్‌యాదవ్, పెదబోయిన రాజు యాదవ్, భూక్య శ్రీకాంత్, చిలువేరు వెంకటేష్, రావుల సత్యనారాయణ పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న విజయరామారావు

ఉద్యమంలా చేపట్టండి

చిల్పూరు: సభ్యత్వ నమోదును ప్రతీ కార్యకర్త ఉద్యమంలా చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సభ్యత్వ నమోదు, కార్యాచరణపై ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సభ్యత్వ నమోదును సెప్టెంబరు 6వ తేదీ నుంచి ప్రారంభించి ప్రతీ బూత్‌కు 200 సభ్యత్వాలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పెండ్యాల దిలీప్, సాదం భీమయ్య, శైలేష్‌గౌడ్, రజనీకర్, అనీల్, తోట శ్రీను, ఎలిశాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న రవీందర్ తదితరులు

రఘునాథపల్లి: మండలంలోని భాంజీపేట గ్రామానికి చెందిన కల్లు గీతకార్మికుడు మాటూరి రమేష్‌గౌడ్ ఇటీవల తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మరణించిన విషయం విదితమే. బాధిత కుటుంబానికి బీసీ కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25 వేల చెక్కును బీసీ వెల్ఫేర్ అధికారి రవీందర్ శుక్రవారం గీత కార్మిక సంఘం నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ సదానందంగౌడ్, మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మీనారాయణగౌడ్, గైని శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ రచ్చ సోమనాథ్, పగిడిపల్లి రాజు, ఆకుల కొండయ్య, యాదగిరి, పుల్ల వెంకటేష్ పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ పోటీలో బ్లూ టీం గెలుపు

జనగామ: జిల్లా కేంద్రంలో క్రీడా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్వామి వివేకానంద విద్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో నాలుగు జట్లు తలపడగా ఫైనల్‌లో బ్లూ టీం విజేతగా నిలిచింది. కెప్టెన్ సుదర్శన్ జోషి, ఎండీ యూనస్, రమేశ్, సతీష్, సాగర్, మనీష్, సురేష్, క్రాంతిలకు బహుమతులను అందజేశారు.


కప్పుతో బ్లూ టీం

స్నేహితుల చేయూత



రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన నక్కల ఉపేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా మృతుడి స్నేహితులు శుక్రవారం వెల్ది గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు రూ. 20 వేల సాయం అందజేశారు. చెరుకు రాజు, పాశం మహేందర్, జీడికంటి రాజు, దున్నపోతుల రవి, పెండ్లి యుగేందర్, పొట్లపల్లి వీరేందర్, రాసమల్ల లింగస్వామి, గువ్వ రాజు, బోయిని కృష్ణమూర్తి, యాదగిరి, సోమరాజు, భాస్కర్, వెంకటేశ్వర్లు, తిరుపతి, పర్వతాలు, కుమారస్వామి, అశోక్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల నిర్ధారణకు రైతులు సహకరించాలి


రైతు కుటుంబంతో సెల్ఫీ దిగుతున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపల్లి: రేషన్‌కార్డు లేకపోవడం, ఇతర కారణాలతో రూ. 2 లక్షల వరకు రుణమాఫీ కాని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం రైతులందరూ సహకరించాలని మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు తమ ఇంటి వద్దకు వచ్చినప్పుడు రైతుతో పాటు కుటుంబంలో 18 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఉండి సెల్ఫీ ఫొటో దిగాలన్నారు. మండలంలోని 697 మంది రైతుల కుటుంబ నిర్ధారణ చేయాల్సి ఉందని తెలిపారు. రైతులు తమ ఆధార్‌కార్డులు తప్పనిసరి చూపించాలని సూచించారు. సెప్టెంబర్ 6 వరకు రైతుల సహకారంతో గ్రామాల్లో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

రుణమాఫీ కాని రైతుల దరఖాస్తులు తీసుకోవాలి

చిల్పూరు: రుణమాఫీ కాని రైతుల అందరి వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుని వారికి న్యాయం చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం రుణమాఫీ కాని రైతుల నుంచి మండల వ్యవసాయాధికారి షేక్ నజీరుద్దీన్, ఏఈఓలు వినయ్‌కుమార్, యాకూబ్ దరఖాస్తులు తీసుకుంటుండగా నాయకులు అక్కడికి చేరుకుని మాట్లాడారు. బ్యాంకు అధికారులు, ఆన్‌లైన్ తప్పిదాలతో అర్హులకు రుణమాఫీ కాలేదని, వారి నుంచి దరఖాస్తులు తీసుకోవాలని ఏఓకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్, సాదం బీమన్న, ఎలిశాల శ్రీనివాస్, సాదం రవి, రజనీకర్, రాజు, గౌరిశంకర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చిల్పూరు: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ రుణమాఫీ, ధరణిలో రైతుల వ్యవసాయ భూముల సమస్యలు పరిష్కరించాలని, తెల్ల కాగితాలపై భూములు ఉండి పట్టా చేసుకోడానికి ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. అనంతరం రెవెన్యూ అధికారులకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. పోలు సంపత్, సాదం పరమేష్, సాదం శ్రీనివాస్, ఊరడి రవి, ముడిక భీమయ్య, ఊరడి మల్లయ్య, అపరాదపు రాజు, ఆవుల ప్రభాకర్, రిబ్కా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసం కలిగిఉండాలి


మాట్లాడుతున్న ప్రసాద్

జనగామ: నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసం కలిగిఉండాలని ప్రముఖ మోటివేషన్ ఇన్‌స్పిరేషన్ స్పీకర్ నగ ప్రసాద్ అన్నారు. పట్టణంలోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో డైరెక్టర్ డి. విజయపాల్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు సాఫ్ట్, మేనేజ్‌మెంట్, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌లపై సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజనం ఏర్పాటు



బచ్చన్నపేట: మండలంలోని బండనాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి జ్యోతి, రాములు దంపతుల కుమారుడు రోహిత్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు భోజన ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్వీట్లు పంపిణీ చేసి భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఇజ్జగిరి సిద్దయ్య, అటెండర్ సిద్దిని నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల: మండలంలోని నీలిబండతండాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గుగులోత్ సంతోష్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. నాయకులు రవీందర్, సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా భైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయం వద్ద భైరవస్వామి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన దాత భీంరెడ్డి కవిత, మల్లారెడ్డి దంపతులు భైరవ స్వామి విగ్రహాన్ని అందించినట్లు తెలిపారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అనంతరం హోమం చేసి పూర్ణాహుతి చేశామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు చెప్పారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీ, ఆలయ సిబ్బంది శ్రీనివాస్, మధు, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.


భైరవస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

సంక్షిప్త సమాచారం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



బచ్చన్నపేట: ప్రజలు తమ ఇంటి చుట్టూ, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం డ్రై డేను నిర్వహించారు. వీధుల్లో తిరిగి కుండలు, డ్రమ్ముల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. జీపీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

దేవరుప్పుల: కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత అత్యధికంగా భాగస్వామ్యం చేయాలని పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సూచించారు. శుక్రవారం తొర్రూరు పట్టణంలో విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి విచ్చేసిన ఝాన్సీరెడ్డిని మండల యువజన నాయకులు సన్మానించారు. యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్, వెంకన్న,రెడ్డి రమేశ్, వెంకన్న, లొడంగి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి లక్ష్మణ్‌తండాలో గుగులోత్ సోమన్న మృతి చెందగా శుక్రవారం ఆయన మృతదేహానికి పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

ఎర్రబోడు భూముల పరిశీలన

పాలకుర్తి: మండలంలోని మల్లంపల్లిలో ఎర్రబోడు భూమిలోని రైతులను పిలిచి వారి పాస్‌బుక్‌లను ఆర్‌ఐ రాకేష్, సర్వేయర్ విజయ్ శుక్రవారం పరిశీలించారు. సర్వేనంబర్ 341లోని 15 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్న గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఆదేశాలతో విచారణ చేపట్టడం జరిగిందన్నారు. రైతుల పాస్‌బుక్‌లు, పట్టా కాగితాలు పరిశీలించి నివేదికను తహసీల్దార్‌కు పంపిస్తామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 4న హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద నిర్వహించనున్న మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. విద్యుత్ ఉద్యోగుల బీసీ అసోసియేషన్ డివిజన్ కార్యదర్శి శ్రీధర్‌పటేల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ నాగవెల్లి ప్రసాద్ మాట్లాడారు. సదన్, శ్రీధర్, రంజిత్, మహేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎండీ.నహీమ్ ఉన్నారు.

ఆయాల సేవలు అభినందనీయం


ఆయాలను సన్మానిస్తున్న సీడీపీఓ రమాదేవి

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు అందించిన సేవలు అభినందనీయమని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి, సూపర్‌వైజర్ మనోహర అన్నారు. బండనాగారం, ఆలింపూర్, కేసిరెడ్డిపల్లి, బోనకొల్లూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసిన వెంకమ్మ, ఎల్లమ్మ, పుల్లమ్మల పదవీ విరమణ వీడ్కోలు సమావేశాన్ని కేసిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుంకోజు రజిత, కవిత, ప్రేమలక్ష్మి, అంజుమ్, శ్రీలత, కౌంసల్య, జ్యోతి, రజిని, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ‘వేద’లో స్వర్ణప్రాశన

జనగామ: జిల్లా కేంద్రంలోని వేద అయుర్వేదిక్ పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌లో నేడు (శనివారం) స్వర్ణప్రాశన కార్యక్రమం ఉంటుందని డాక్టర్ అంజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు స్వర్ణప్రాశన చిన్నారులకు వేయడం జరుగుతుందన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ ప్రాథమిక పాఠశాలకు పలువురు ఉపాధ్యాయులు ప్రింటర్‌ను బహూకరించినట్లు హెచ్‌ఎం మామిడాల ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన, ప్రమోషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులు రూ.10 వేల విలువైన ప్రింటర్‌ను అందజేసినట్లు చెప్పారు. కాగా, పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం ప్రభాకర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దీనారాణి, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్, ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


ఎల్లయ్య (ఫైల్)

దేవరుప్పుల: మండలంలోని కడవెండి మాజీ సర్పంచ్ కొమ్మగళ్ల ఎల్లయ్య (78) శుక్రవారం మృతి చెందాడు. టీడీపీ తొలి ప్రభుత్వంలో గ్రామ తొలి సర్పంచ్‌గా రాణించిన ఎల్లయ్య అప్పట్లో ఉమ్మడి జిల్లా స్థాయి కాంట్రాక్టర్ పనులు చేసేవాడు. టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన క్రియాశీలకంగా పనిచేశాడు. ఆయన మృతి పట్ల బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, ఈఎస్‌ఆర్, అస్నాల ఆగమ్మ, తాటిపెల్లి మహేష్, హన్మంతు, రఫేల్‌రెడ్డి, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన పురోహితుడు మృతి


రామచంద్ర మూర్తి (ఫైల్)

రఘునాథపల్లి: హనుమకొండ-హైదరాబాద్ జాతీయ రహదారిలోని నిడిగొండ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్టేషన్ ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన పురోహితుడు ఎల్లంబట్ల రామచంద్రమూర్తి (70) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇప్పగూడేనికి చెందిన రామచంద్రమూర్తి హైదరాబాద్‌లోని తన కూతురు వద్దకు వెళ్లి తిరుగు ప్రయాణంలో గురువారం రాత్రి జనగామలోని తన టీవీఎస్ ఎక్సెల్‌పై స్వగ్రామానికి బయలుదేరగా నిడిగొండ బ్రిడ్జి వద్ద హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న నర్సంపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎక్సెల్‌ను ఢీ కొట్టింది. దీంతో రామచంద్రమూర్తి ఎగిరి రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని తీవ్ర గాయాలైన రామచంద్రమూర్తిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

ఘనంగా తీజ్



దేవరుప్పుల: మండలంలోని ధర్మాపురం రెవెన్యూ పరిధి పడమటితండా గ్రామంలో లంబాడీలు తీజ్‌ను శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించుకున్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు జాటోత్ పార్వతీ మోర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎంపీ ఫ్లెక్సీని చించివేయడం సిగ్గుచేటు’



జనగామ రూరల్: భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఫ్లెక్సీ చించివేయడం సిగ్గుచేటని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆభిగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు ప్రవీణ్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో గెస్ట్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన ఎంపీ ఫ్లెక్సీ చింపివేయడం సరికాదన్నారు. ఇలాంటి పనులు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.